## క్లుప్తంగా

### చలివేంద్రం ప్రారంభం



**పిడుగురాళ్ల:** వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మంచినీటిని అందజేయడం ఆనందదాయకమని ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలియజేశారు. పట్టణంలో అస్లాం స్పోర్ట్స్‌షాపు వారి ఆధ్వర్యంలో అంజిరెడ్డి హాస్పటల్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటిని చలివేంద్రాన్ని ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వేసవి రోజు రోజుకు పెరిగిపోతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి చలివేంద్రాలు అడుగడుగున ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో అస్లాం స్పోర్ట్స్ షాపు సభ్యులు తదితరులు ఉన్నారు.

### నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

**పిడుగురాళ్ల:** పట్టణంలో మంగళవారం నీటికి అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు తెలియజేశారు. కృష్ణానది నుంచి వచ్చే వాటర్ పైపులైన్‌కు లీక్ కావడం వల్ల మంగళవారం మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. మరలా బుధవారం పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ అంతరాయాన్ని ప్రజలకు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### క్రీడలతో మానసిక ఆనందం

ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి



**పిడుగురాళ్ల:** క్రీడలతో మానసిక ఆనందం కలుగుతుందని ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి అన్నారు. పట్టణంలోని కళ్లంటౌన్ షిప్‌లో జగనన్న నాకౌట్, వైనాట్ 175 క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా నేడు క్రీడలకు ప్రాధాన్యత తగ్గిపోయిందని, నేడు పిల్లలు అంతా సెల్ ఫోన్ క్రీడలకు పరిమితమవుతున్నారని, కాని తల్లిదండ్రులు గమనించి సెల్ ఫోన్ క్రీడలు పిల్లలు ఆడకుండా మైదానంలో క్రీడలు ఆడేవిధంగా చూడాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నెలటూరి బాలస్వామి, వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆవుల పుల్లారావు, దయాకర్, రత్నబాబు తదితరులు ఉన్నారు.

### విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు

**దాచేపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గామాలపాడు, కొత్తూరు, మాదినపాడు, పొందుగల, రామాపురం, శ్రీనగర్, ఇరికేపల్లి, భట్రుపాలెం, తంగెడ, కాట్రపాడు గ్రామాల్లో ఈఈ బి. విజయ్‌కృష్ణ ఆధ్వర్యంలో 45 మంది అధికారులు, 135 సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 4300 సర్వీస్‌లను పరిశీలించి విద్యుత్ చౌర్యంకు పాల్పడుతున్న 88 మందిని గుర్తించి రూ. 3.94లక్షల అపరాధ రుసుంను విధించారు. ఈ తనిఖీలో స్థానిక ఏడిఈ వీరాంజనేయులు, ఏఈలు నాగేశ్వరరావు, నాయక్ తదితరులున్నారు.

### తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

**దాచేపల్లి :** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పులిచింతల ప్రాజెక్ట్ ముంపు బాధితులు సోమవారం ఆందోళన చేశారు. ముంపు గ్రామమైన ఏలియంపేటకు చెందిన బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దార్ తానంగి ప్రవీణ్‌కుమార్ వినతిపత్రం అందించారు. ముంపు గ్రామమైన ఏలియంపేటకు చెందిన తమకు దాచేపల్లిలోని ముత్యాలంపాడు రోడ్డులో ఇళ్ల ప్లాట్లను ప్రభుత్వం కేటాయించిందని, కొంత మంది వ్యక్తులు ఈ స్థలాల్లోకి తమను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని తహసీల్దార్‌కు చెప్పారు. విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.

### వేసవి శిబిరంతో విజ్ఞానం పెంపు

**గురజాల :** చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని లైబ్రేరియన్ సీహెచ్ హిమభార్గవి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరానికి చిన్నారుల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు బొమ్మలు తయారు చేయడం, గీయడం, కథలు చదివించడం వారిలో చదువుపై ఆసక్తి కనబరిచేలా చూడడం వంటివి శిక్షణం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ‘భూ’ ఆక్రమణలకు చెక్

- మరో ఐదు విడతల్లో పరిశీలన
- దొంగ డాక్యుమెంట్లకు స్వస్తి

**పిడుగురాళ్ల:** ‘భూ’ ఆక్రమణలకు చెక్ పెట్టే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ రిసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం పరిధిలో ఉన్న భూమిని రి సర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లై సర్వే కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. ప్రజలకున్న భూమిని ఇతరులు ఎవరు ఆక్రమించకుండా ఎవరి భూమిని వారు అనుభవించేందుకు అన్ని రకాలుగా పూర్తి స్థాయిలో పకడ్బందిగా ఈ భూ సర్వే కార్యక్రమం జరుగుతుంది. ఈ భూ సర్వే వల్ల ప్రజలకు చాల ఉపయోగాలు ఉన్నాయి... భూమికి సంబంధించిన దొంగ డాక్యూ మెట్లు పుట్టించే అవకాశం ఉండదు, డొంకలు, రోడ్లు, చెరువులు, కాల్వలు, ఎక్కడెక్కడ ఉన్నాయి అనే సమాచారంతో పాటు వీటి ఎవరు ఆక్రమించే అవకాశం ఉండదు. ప్రజలకు చెందిన భూమికి సంబంధించి ఎవరి హద్దులు వారికి కేటాయిస్తారు. మరీ ముఖ్యంగా ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించుకునే అవకాశం లేకుండా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఒకరి భూమిని మరొక్కరు దొంగ రిజిస్ట్రేషన్ చేకసుకునేందుకు ప్రయత్నిస్తే వెంటనే ఆన్‌లైన్‌లో దొరికి పోతారు. మొత్తం మీద గతంలో జరిగిన భూ మాఫియా లాంటివి భవిష్యత్‌లో జరగకుండా ఉండేందుకు ఈ భూ రిసర్వే పూర్తి స్థాయిలో పనిచేస్తోంది.



డ్రోన్ సహాయంతో రి సర్వే నిర్వహిస్తు సర్వే బృందం

**7,861 ఎకరాల్లో సర్వే పూర్తి...**

పట్టణంలోని 33 వార్డులోని 17 సచివాలయాల పరిధిలో 7,861 ఎకరాల భూమిని డ్రోన్ ఫ్లై సర్వే పూర్తి చేశారు. ఇందులో నివాస భూమి, కమర్షియల్ భూమి 2,070 ఎకరాలుగా సర్వేలో ఉందని సర్వేలో తేల్చారు, అదేవింగా వ్యవసాయ భూమి 5,791 ఎకరాలు ఉన్నట్లు సర్వేలో తెలిందని అధికారులు వెల్లడించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలు సర్వే నిర్వహించి భూ యజమానులకు చెందిన భూమి హద్దుల పాయింట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ డ్రోన్ ఫ్లై సర్వే పూర్తి అయిన వివరాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏజెన్సీ వారికి సమర్పిస్తారు. వారు డీఎంఏ కార్యాలయానికి పంపి అక్కడున్న టెక్నికల్ టీమ్ మ్యాప్ ద్వారా చెకింగ్ పాయింట్స్‌ను గుర్తించి తిరిగి పట్టణ మున్సిపల్ కార్యాలయానికి నివేదికలు పంపుతారు. వాటిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఫైనల్ మ్యాప్‌ను పరిశీలించి ఫైనల్ డ్రాయింగ్‌ను మున్సిపల్ అధికారులు డీఎంఏ కార్యాలయానికి పంపుతారని మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు. అదేవిదంగా సర్వే విభాగంలో మరో ఐదు స్టేజీల్లో పరిశీలించిన పిదప చివరిగా ప్రజల డాక్యుమెంట్స్‌ను పరిశీలించి ఎవరి హద్దులు వారికి కేటాయిస్తారు. దీంతో ప్రజలకు శాశ్వతంగా భూ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఉపయోగ పడుతుంది.



సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

### భూ రీ సర్వేతో ప్రజలకు శ్రీరామ రక్ష ..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ రిసర్వే ప్రజలకు ఎంతో ఉపయోగ కరం. అందులో భాగంగానే పిడుగురాళ్ల పట్టణంలోని అన్ని ప్రాంతాలను ఇప్పటికే డ్రోన్ ఫ్లైసర్వే నిర్వహించడం జరిగింది. సర్వే నిర్వహించిన ఏరియాల్లో హద్దులు ఏర్పాటు చేయడం జరిగింది. టెక్నికల్ సర్వేతో పాటు, మ్యాప్ ద్వారా చెకింగ్ పాయింట్స్‌ను గుర్తించి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ రి సర్వే పూర్తేతే ప్రజల భూములుకు శ్రీరామ రక్షగా ఉంటుంది.

– ఎ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ పిడుగురాళ్ల

### నికరంగా ఎవరి భూమి వారికే..



భూ రి సర్వే పూర్తేతే నికరంగా ఎవరి భూమి వారికే ఉంటుంది. ఒకరి భూమిని మరొకరు ఆన్‌లైన్‌లో ఎక్కుంచుకునే అవకాశం ఉండదు. ప్రభుత్వ భూమిని కూడా ఎవరు ఆక్రమించుకునే అవకాశం ఉండదు. ఈ భూ సర్వేతో భూ వివాదాలకు, భూ మాఫియాకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టినట్టే.

– కొత్త వెంకట సత్యానారాయణ, టీపీఎస్ పిడుగురాళ్ల

## ఎత్తిపోతల పథకానికి త్వరలోనే శంకుస్థాపన

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

**వెల్దుర్తి:** పల్నాడు ప్రజల చిరకాలవాంఛ అయిన వరికపూడిసెల ఎత్తిపోతల నిర్మాణ పథకానికి త్వరలోనే శంకుస్థాపన చేయిస్తానని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ స్వామి వారి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఈ పథకానికి అటవీ అనుమతులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసేందుకు సీఎం జగన్, ఎంపీ కృష్ణదేవరాయలు ఎంతో కృషి చేశారన్నారు. పల్నాటి ప్రజలకు మంచిరోజులు వస్తున్నాయని, వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్టును సాధించామని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లోని రైతులకు ఈ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, పిన్నెల్లి మదనమోహన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతా ఆదినారాయణ, చపారపు లచ్చిరెడ్డి, ఈగల అయ్యన్న, భూమిరెడ్డి రామాంజిరెడ్డి, లింగాల రాఘవాచారి, గట్లా బ్రహ్మారెడ్డి, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, బొజ్జా శివ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ప్రభను ప్రారంభించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిఆర్కే

## వడియరాజుల సమస్యల పరిష్కారానికి కృషి

మార్కెట్‌యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు

**పిడుగురాళ్ల:** పట్టణంలోని వడియరాజుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లాల్లో వడియరాజులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం వడియరాజుల గురించి ఆలోచించలేదని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాత్రమే మనకు పతం కట్టడంతపాటు, తమకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఆయన తెలియజేశారు. మనం అడగ్గానే వడ్డెర ఓబన్న విగ్రహాన్ని పట్టణ నడిబొడ్డులో ఏర్పాటు చేసి మన ఖ్యాతిని నలుదిక్కుల కనిపించేలా చేశారని ఆయన తెలియజేశారు. అలాగే మనకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తీసుకొని వెళ్లి ఆయన ద్వారా మన సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలియజేశారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లాని, ఆయన పరిష్కరించారని, ఇంకా ఎమైనా ఉంటే వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, ఇర్లా గురుస్వామి, కౌన్సిలర్లు ఉప్పు వెంకటేశ్వర్లు, వేముల సాంబయ్య, దేవల నాగరాజు, గోగుల వెంకటేశ్వర్లు, గోగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఓర్సు శ్రీనివాసరావు, వడ్డెర సంఘ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

**మాచర్ల:** పట్టణంలోని పాత మాచర్లలోని వడ్డెర పాలెంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ రెండవ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఘనంగా జరిపారు. సోమవారం ఉదయం నుంచి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు బారులు తీరి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు హోమం నిర్వహించి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డిలు పాల్గొని పూజా కార్యక్రమంలో జరిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు దేవాలయానికి చేరుకోగానే ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఆర్కే, పీవీఆర్‌లు దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వేలాది మందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి వడ్డన చేశారు. స్వామి వారి రథం పై ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు జరిపారు. ప్రతిష్ఠ మహోత్సవాన్ని భారీ స్థాయిలో భక్తులు స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు ఉప్పుతోళ్ళ గోవిందరాజులు, కార్యదర్శి జూలకంటి వీరారెడ్డి, ఎం శ్రీనివాసశర్మ, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, సాయిబాబా, కార్యదర్శి ఓరుగంటి చెన్నకేశవరావు, ఉప్పుతోళ్ళ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, కొమెర శ్రీను, మేడం శివన్నారాయణ, కాశంగి నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, రంగా చెన్నయ్య, పిన్నెల్లి తేజ, మారం వాసు, ప్రసాద్, చిట్టేటి నాగేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, కౌన్సిలర్లు బత్తుల వేణు, పోలా శ్రీను, ఎం శ్రీనివాసరావు, మున్నా మురళీ, ఎంపీపీ బూడిద శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.



దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

### భానుడు భగభగలు



**గురజాల :** భానుడు భగ్గుమంటున్నాడు. వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచే వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు 10 గంటల లోపే ఇళ్లకు చేరుతున్నారు. ఆదివారం 45 డిగ్రీలు సోమవారం 44 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయి. నిత్యం ప్రజలు, ప్రయాణీకులతో రద్దీగా ఉండే మెయిన్ బజారు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండవేడిమికి తట్టుకోలేక మధ్యాహ్నం సమయంలో దుకాణాలు మూసివేసి వెళ్తున్నారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**మాచర్ల:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా జరుపుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈ వి రమణబాబు, 22వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరసింహారావు సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 5గం''ల నుంచి వార్డులో ప్రతి గడపకు తిరిగి పీఆర్కే ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలు అందజేయనున్నారు. కార్యక్రమానికి అన్ని వర్గాలు జయప్రదం చేసేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు.

## పాలువాయిలో 35 ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధం

**పాత పాలువాయి(రెంటచింతల):** మండలంలోని పాత పాలువాయి గ్రామంలో సోమవారం సాయంత్రం రూ. 3.50 లక్షల విలువైన 35 ఎకరాల నాలుగు వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన జరిగింది. గ్రామంలోని చిట్టిమళ్ళ శ్రీనివాసరావుకు చెందిన రూ.1 లక్ష విలువైన 10 ఎకరాల గడ్డివామి, భీమవరపు అమరలింగంకు చెందిన రూ. 50 వేల విలువైన 5 ఎకరాల వరిగడ్డి వామి, సీనావత్ సైదానాయక్‌కు చెందిన రూ. 1.20 లక్షల విలువైన 12 ఎకరాల గడ్డివామి, తమ్మిశెట్టి శ్రీనివాసరావుకు చెందిన రూ.80 వేల విలువైన 8 ఎకరాల వరిగడ్డి వామి ఈ అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న మాచర్ల అగ్నిమాపక వాహనం సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి ఉంటారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



### గుత్తికొండ బిలంలో యువకుడి మృతి

**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల మండలం గుత్తికొండ బిలం కొలనులో స్నానానికి దిగిన మస్తాన్ షరీఫ్(45) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మాచవరం మండలం మల్లవోలు గ్రామానికి చెందిన మస్తాన్ షరీఫ్ తాగుడుకి బానిసై నందున తన వ్యసనాన్ని మానేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి దేవ్వునిముందు ప్రమాణం చేసి పసర మందు తీసుకొనుటకు వచ్చిన తరుణంలో ముందుగా కొలనులో స్నానమాచరించేందుకు కొలలోకి దిగాడు, స్నానం చేసే సయంలో గల్లంతైయ్యాడు. వెంటనే పట్టణ పోలీసులకు స్థానికులు తెలపడంతో ఎస్‌ఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా మస్తాన్ షరీఫ్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

## మద్యం మత్తులో యువకుడు మృతి

**పిడుగురాళ్ల:** రోజువారి కులీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తి మద్యం సేవించి మద్యం మత్తులో మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని బొడ్డురాయి సెంటర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం ...పట్టణానికి చెందిన కోటా రవికుమార్(43) సంవత్సరాలు ఇతను ఆర్‌టీసీ కండెక్టర్ ఉద్యోగానికి గత ఐదు సంవత్సరాలుగా వెళ్లకుండా మద్యానికి బానిసై రోజు వారి కులీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి బొడ్డురాయి సెంటర్‌లో నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఇతను ఆదివారం రాత్రి ఫుల్‌గా మద్యం సేవించి బొడ్డురాయి వద్ద నిద్రించాడు. తెల్లవారే సరికి అతను మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు రవికుమార్ భార్య, పిల్లల వద్దకు కూడా ఐదేళ్ల నుంచి దూరంగా ఉంటున్నాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సుభాని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.



మృతి చెందిన కోటా రవికుమార్

### నూతన కమిటీ ఎంపిక

**మాచర్ల:** పట్టణంలో వాసవి కన్యక పరమేశ్వరి వృద్ధాశ్రమ నూతన కమిటీ అధ్యక్షులుగా పోలిశెట్టి చిన పిచ్చయ్య బాధ్యతలు స్వీకరించారు. అనేక సంవత్సరాలుగా ఆర్యవైశ్య వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వృద్ధులకు చేయూతనిస్తున్నారు. అందులో భాగంగా ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యులు పోలిశెట్టి చినపిచ్చయ్యకు ఎంపిక చేశారు. పూర్తిస్థాయి కమిటీల్లో భాగంగా వృద్ధాశ్రమ గౌరవాధ్యక్షులు మేడం శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చెన్నకేశవరావు, జాయింట్ సెక్రెటరీగా పోలూరి సత్యనారాయణ, పోలిశెట్టి కృష్ణమూర్తి, ఓబులశెట్టి నాసరయ్య, కోశాధికారిగా చుండూరు సత్యనారాయణలను ఎంపిక చేశారు. ఆర్యవైశ్య నేత కొత్తూరి కాశీవిశ్వనాథం, శ్రీలక్ష్మీచెన్నకేశవ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు గోపవరపు నాగేశ్వరరావు, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, చిల్లంచర్ల సత్యనారాయణ, కొత్తమాసు బ్రహ్మరావు, జివికెఎస్ ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

### వ్యక్తి ఆత్మహత్య

**చిలకలూరిపేటటౌన్:** కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపంతో వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన బోడపాటి రోశయ్య(55) పొలం పనులు చేస్తుంటాడు. డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉన్న రోశయ్య ఆ విషయంలో కుటుంబ సభ్యుల మాటలకు మనస్థాపం చెంది మండలంలోని బొప్పూడి ఆంజనేయస్వామి గుడి ఎదురు పొలాల్లో పురుగుమందు తాగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఈపూరు :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బోడిశంబునివారిపాలెం ప్రధాన రహదారి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండకు చెందిన ఇర్ల వెంకటేశ్వర్లు (26) ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకట్రావు, సిబ్బంది అక్కడికి వెళ్లి వివరాలుసేకరించి కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, ఒక బాబు ఉన్నారు.

## అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**రెంటచింతల:** రెంటచింతలలోని విత్తన విక్రయ కేంద్రాల్లో అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక విత్తనాల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను, వివిధ రకాల కంపెనీలకు చెందిన విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి మాట్లాడారు. ఏపిలో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరిత్యా నేరమన్నారు. షాపు నిర్వాహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ(మద్దతు) ధరలకు ఇవ్వాలని సూచించారు. విత్తనాల ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి షాపులను సీజ్ చేసి షాపు నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 30 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు, లాట్ నెంబర్‌తో సహా ఖరీదు చేసిన రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. తనిఖీల్లో ఎంఏఓలు గొట్టం లక్ష్మారెడ్డి, గొంటు కృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులున్నారు.



విత్తన విక్రయ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

**దుక్కులకు అనుకూలమైన సమయం**

సాగు భూముల్లో దుక్కులు దున్నుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో కురసే అకాల వర్షాలను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని లేని ఎడల వర్షం నీటికి భూమి కోతకు గురయే ప్రమాదం ఉందన్నారు వాలుకు అడ్డంగా దున్నిన వ్యవసాయభూమి ఎక్కువ తేమను కలిగే సామర్థ్యం ఉంటుందన్నారు. లోతుగా దుక్కులు దున్నిన భూమిలో మొక్కల వేర్లు లోతుగా పాదుకుని వెళ్లడం వల్ల పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. పంట పొలాల్లో పంటలను సాగుచేయడం వల్ల చీడపీడలు భూమిలో ఉంటాయని వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూముల్లో ఉండే క్రిమి కీటకాలతోపాటు చీడపీడలు ఎండలకు చనిపోతాయన్నారు. వేసవిలో దుక్కి దున్నుకోవడం వల్ల అయ్యే ఖర్చు కన్నా దానిద్వారా రైతుకు చేకూరే ప్రయోజనమే ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

## కాలుష్య నియంత్రణకు కృషి



రేమిడిచర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు



పర్యావరణ హిత జీవన విధానంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

**బొల్లాపల్లి :** అటవీ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. బొల్లాపల్లి, మేళ్లవాగు సెక్షన్ల పరిధిలో రేమిడిచర్ల, మర్రిపాలెం గ్రామాల్లో పర్యావరణ హిత జీవన విధానంపై ఆ శాఖ అధికారులు సోమవారం అయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడే ఉద్దేశంతో ప్రజలను చైతన్య పరిచేందుకు కాలుష్య రహిత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆ శాఖ అధికారులు చెప్పారు. ప్లాస్టిక్ నియంత్రణ, ఇంధన పొదుపు, చెట్ల నరికివేత, వృక్ష సంపద అభివృద్ధిలో అటవీ సమీప గ్రామాల్లో ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రం చేయడం, ప్లాస్టిక్‌ను అటవీ పరిసర ప్రాంతాల్లో నిషేధించడంపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వోలు వై.సూర్యనారాయణ, ఎం.హరికుమార్, సర్పంచ్‌లు గాదె వెంకటరమణ, బ్రహ్మానాయక్, జి.కాంతానాయక్, ఫారెస్ట్ బీట్ అధికారులు వై.భాస్కర్, ఎస్.గణేష్‌బాబు, షేక్ అమీర్‌జానీబాషా, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఆర్‌బీకేల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ఈపూరు :**రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు (డీఆర్‌సీ డీడీఏ) ఎం.శివకుమారి తెలిపారు. కొండ్రముట్ల గ్రామంలో ఖరీఫ్ సాగు సమాయత్తంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ సాగు మొదలయ్యే లోపు పచ్చిరొట్ట విత్తనాలు, ప్రధాన పంటల విత్తనాలు, ఎరువులు అన్నింటిని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

### గురు ఆదిత్య పాఠశాల గుర్తింపు రద్దు

**దాచేపల్లి :** స్థానిక గురు ఆదిత్య ప్రైవేట్ పాఠశాల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేసిందని ఎంఈఓ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన గుర్తింపు రద్దుకావడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవద్దని ఆయన కోరారు.